పూత.. కాయ అయ్యేనా!

- ఆశాజనకంగా మామిడి పూత
- మంచు ప్రభావంతో రైతుల ఆందోళన



టెక్కలిలో ఆశాజనకంగా ఉన్న మామిడి పూత



పూత దశలో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న రైతు

టెక్కలి: మామిడి పూత ఆశాజనకంగా కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం కురుస్తున్న తేనే మంచుతోపాటు వాతావరణంలో కొద్దిరోజులుగా మార్పులు చేసుకోవడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. చీడపీడల ప్రభావంతో దిగుబడి విషయంలో ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. మరో వైపు మామిడి పంటకు బీమా విషయంలో రైతులే పూర్తిగా తమ వాటా చెల్లించుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో వారు విముఖత చూపడం లేదు. ఒకపక్క తేనే మంచు ప్రభావంతో పూత మాడిపోయే ప్రమాదం ఉండడంతో పంట కలిసి వస్తుందో లేదోననే ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో సుమారు 1042 ఎకరాల్లో సుమారు 850 మంది రైతులు మామిడి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ మంచు ప్రభావంతో ఎటువంటి చీడపీడలు ఆశిస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో ఉద్యానవన శాఖాధికారులు కొన్ని రకాల జాగ్రత్త చర్యలను సూచిస్తున్నారు.

మామిడి పంటను ఆశించే తెగుళ్లు

ప్రస్తుతం మామిడి పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ తేనె మంచు ప్రభావంతో కొన్ని రకాల తెగుళ్లఆశించే అవకాశం ఉన్నట్లు ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. వాటిలో తేనే మంచు పురుగు, తామర పురుగు, పండు ఈగ, కాండం తొలుచు పురుగు, బూడిద తెగులు, పూత మాడు తెగులు, అంత్రక్నోస్ తెగులు తదితర చీడ పీడలు మామిడి పంటను ఆశించి రైతులకు నష్టానికి గురి చేస్తాయి. దీనికి సంబంధించి ఉద్యానవన శాఖాధికారుల సలహాలు, సూచనలతో కొన్ని రకాల సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

పూత మొగ్గ దశలో: తేనే మంచు తెగులు ఆశిస్తాయి. దీనినే మసి తెగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు అంటారు. ఈ తెగులుకు మోనోక్రోటోఫాస్, మ్యాంకోబజెబ్ వంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

పచ్చి పూత దశలో: తేనే మంచు పురుగు, ఆంత్రోక్నోస్, బూడిద తెగులు ఆశిస్తాయి. దీనికి బుప్రోఫెజిన్, హెక్సాకోనోజోల్, అజాడిరక్టిన్ తదితర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

నల్లపూత దశలో: ఈ దశలో తేనే మంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు ఆశిస్తాయి. దీనికి బుప్రోఫెజిన్, ఎఫిసేట్, థయోఫినేట్ మిథైల్, కార్బెండజిమ్, మాంకోజెబ్ తదితర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

గోలి దశ నుంచి నిమ్మకాయ దశలో: మామిడి పిందెలు గోలి దశ నుంచి నిమ్మకాయ దశలో ఉన్నప్పుడు తొడమ కుళ్లు తెగులు ఆశిస్తాయి. దీనినివారణకు డైనైటోఫురాన్, అజాక్సిస్ట్రోబిన్, టెబ్యుకోనజోల్, ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్ తదితర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వీటితో పాటు మామిడి పిందెలు గోలి కాయ నుంచి నిమ్మకాయ సైజు ఉన్న కాలంలో పది సంవత్సరాలు పైబడిన చెట్లకు రెండవసారి ఎరువులు, యూరియా, పొటాష్ నిర్దేశించిన కొలమాన ప్రకారం చెట్టుకు వేయాలి. ఫిబ్రవరి, మార్చి నెలలో నీటి తడులను 15 రోజులకొకసారి ఇవ్వాలి. డ్రిప్ ఉన్న రైతులు ప్రతీ రోజూ నీటి తడిని అందివ్వాలి.

చీడలపై ఆందోళన చెందుతున్నాం



మామిడి పంటలను ఆశించే చీడలపై రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి సంబంధించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బీమా విషయంలో ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం లేదు. పూత దశలో గ్రామాల్లో మామిడి రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి.

–టి.నారాయణరావు,
మామిడి రైతు, గూడేం, టెక్కలి మండలం.

ఆందోళన వద్దు



ప్రస్తుతానికి మామిడి పూత ఆశాజనకంగా ఉంది. మామిడి పంటను ఆశించే చీడ పీడల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తెగుళ్ల నివారణ కోసం ఉద్యానవన శాఖ సిబ్బంది సూచించే విధంగా సస్యరక్షణ చర్యలు చేపడితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆశించిన మేరకు దిగుబడులు సాధించవచ్చు.

–కె.సునీత,
ఉద్యానవన శాఖాధికారి, టెక్కలి

క్లుప్తంగా

శుద్ధజల యూనిట్ ప్రారంభం



శుద్ధజల యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: చక్కటి ఆరోగ్యానికి శుద్ధ జలం ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారి డి.దాశరథి అన్నారు. రెయ్యిపాడు పంచాయతీ బచ్చలవానిపేట ప్రాథమిక పాఠశాలలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన కెంట్ శుద్ధజల యూనిట్‌ను మంగళవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం కోసమే శుద్ధ జల యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ పెద్దలు బచ్చల వైకుంఠరావు, ఉపాధ్యాయులు మనోజ్, సొసైటీ ప్రతినిధులు కీలు కమల, శాంతి, సావిత్రి రాజు, సురేష్, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల అవసరం



నాటక ప్రదర్శనలో విద్యార్థులు

పలాస: విద్యార్థులకు ప్రణాళికతో పాటు పట్టుదల కలిగి ఉన్నప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలరని వక్తలు అన్నారు. బ్రాహ్మణతర్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల వీడ్కోలు, వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణరావు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్య చాలా అవసరమన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: బెల్లుపడ, కొల్లూరు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాపాక మాధవరావు, కిలుగు ఢిల్లీరావు ఇటీవల మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు దుర్గాసి ధర్మారావు, లద్దు కేశవపాత్రో, కొణపల సురేష్, స్థానిక సర్పంచ్ అయిధం జయరాం, పైల లక్ష్మీనారాయణ, పైల గణేష్‌రెడ్డి ఉన్నారు.

తీరంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు

సంతబొమ్మాళి: మండలంలోని ఉమిలాడ తీర ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఎం.అప్పారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సముద్రపు ఇసుకను రోజూ తవ్వేసి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఇందులో టీడీపీ కార్యకర్తలు ప్రధాన సూత్రధారులుగా ఉన్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం దుకాణాలు బంద్

ఇచ్ఛాపురం: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం నాలుగు నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.డి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ గంగాధర్

పలాస: ప్రతిఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు విధిగా పాటించాలని శ్రీకాకుళం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.వి.గంగాధర్ అన్నారు. రామక్రిష్ణాపురంలోని శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మరో ఎంవీఐ శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యాయులు సూర్యతేజ, అనుదీప, దాలేటి, ఉమా, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోరు బాగు చేయాలి

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి శంబానవీధి సమీపంలోని చేతి బోరు పాడైంది. దీంతో స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సుమారు నాలుగు నెలల క్రితం బోరు మరమ్మతులకు గురైంది. అప్పట్లో పంచాయతీ అధికారులు బాగు చేస్తామని చెప్పి బోరు హెడ్‌ను తీసుకొన్ని వెళ్లినప్పటికీ.. ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. వేసవి నేపథ్యంలో అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి నీటి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేది ఎప్పుడు?

- వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు
- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని.. అయితే తొమ్మిది నెలలైన ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సాగునీరు అందజేస్తామని ప్రకటనలు చేసిన మంత్రి అచ్చెన్న ఇప్పుడు చుక్క నీరు ఇవ్వకపోగా టెక్కలి నియోజకవర్గంలో ఉన్న చెరువులు, వాగుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా సముద్రంలోకి మళ్లించేశారని దుయ్యబట్టారు. సుమారు 1200 ఎకరాలకు సాగు నీరు ఇవ్వలేని దుస్థితిలో మంత్రి ఉన్నారని విమర్శలు చేశారు. గత వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నందిగాం మండలానికి మంజూరు చేసిన విత్తనోత్పత్తి కేంద్రం గురించి కనీసం దృష్టి సారించని అసమర్థత మంత్రి అచ్చెన్నాయుడని తిలక్ మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో టెక్కలి నియోజకవర్గానికి ఇచ్చిన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో సుమారు రూ. 800 కోట్లు కేటాయిస్తూ పనులు కొనసాగించారన్నారు. ఇప్పుడు ఆ పనులు సైతం పూర్తి చేయలేని స్థితిలో మంత్రి ఉండడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మంత్రి తన సొంత నియోజకవర్గంలో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, పూర్తి స్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయకుండా ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా ఉండి వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేయడం విచారకరమన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, నాయకులు సత్తారు సత్యం, కె.జీవన్, జె.తిరుమలరెడ్డి, డి.లోకేశ్వర్‌రెడ్డి, కృష్ణారావు ఉన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో గణేష్ ప్రతిభ



గణేష్‌ను అభినందిస్తున్న కోచ్ భాస్కరరావు

కాశీబుగ్గ: ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగిన మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్‌లో వజ్రపుకొత్తూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన ఆర్.గణేష్ 55 కేజీల విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. శ్రీకాకుళం జిల్లా తరఫున గణేష్ రాణించడంతో పలాసకు చెందిన కోచ్‌లు నెయ్యల భాస్కరరావు, ఆమదాలవలస శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేస్తూ గణేష్‌ను పలాసలో మంగళవారం అభినందించారు. మార్చిలో జరగనున్న జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు గణేష్ అర్హత సాధించినట్లు కోచ్‌లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

- మిత్రుని కుటుంబానికి రూ. 1.6 లక్షల ఆర్థిక సాయం



రమేష్ పండా భార్యకు నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తనతోపాటు చదువుకున్న స్నేహితుడి మృతితో రోడ్డున పడిన కుటుంబానికి ఆర్థికసాయం చేసి అండగా నిలించారు. పలాస హైస్కూల్‌లో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న రమేష్ పండా అనే పూర్వ విద్యార్థి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి ఒక లక్షా ఆరు వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని రమేష్ పండా భార్యకు మంగళవారం అందజేశారు. పిల్లల చదువుకు కూడా తమవంతు సహకరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్తకోట తిరుమలరావు, పూలదాసు, శ్రీను, సతీష్ వడి విఠల్, కిషోర్, అప్పలస్వామి, సత్య, గిరి, గోపాల్, రాము పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



కంచిలిమాస్టర్ ట్రైనర్లను సన్మానిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



కవిటి:శిక్షణలో రాణించిన కార్యకర్తలను సత్కరిస్తున్న ఎంఈవో ధనంజయమజ్జి



సోంపేట: ముగింపు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు



వజ్రపుకొత్తూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

కంచిలి/కవిటి/సోంపేట/వజ్రపుకొత్తూరు/ఇచ్ఛాపురం: చిన్నారులకు వైవిధ్యంగా బోధన చేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు, ఉత్తమ కార్యకర్తలను అధికారులు సత్కరించారు.

విజయీభవ..



వచ్చేనెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి అత్యధిక మార్కులు సాధించి విజయం సాధించాలని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

–ఇచ్ఛాపురం రూరల్

పోలింగ్ కేంద్రం పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు మంగళవారం పరిశీలించారు. కేంద్రంలోని సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్ఎం తారకేశ్వర పండా ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

పర్యావరణంపై ప్రచారం



మొక్కలు పెంచి పర్యావరణాన్ని రక్షిద్దామని నెల్లూరుకు చెందిన జేసీఐ సంస్థ సభ్యుడు చైతన్య అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం ఇచ్ఛాపురం చేరుకుంది. ఈ సందర్భంగా చైతన్యకు స్థానిక జేసీఐ సభ్యులు ఆహ్వానం పలికారు. మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కళాశాల ఆవరణలో మొక్కలునాటారు. జేసీఐ ప్రెసిడెంట్ కె.జయదేవ్, కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, మోహన్, వెంకటేష్, షణ్ముఖరావు, స్వరూప్ ఉన్నారు.

–ఇచ్ఛాపురం టౌన్

చికెన్ కోసం.. ఎగబడిన జనం..



బర్డ్‌ఫ్లూ భయాన్ని పోగొట్టేందుకు మంగళవారం టెక్కలిలో నిర్వహించిన చికెన్ మేళాకు జనం ఎగబడ్డారు. వెంకాబ్ చికెన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద సాయంత్రం నిర్వహించిన మేళాలో చికెన్ పకోడి, కర్రీ, ఉడకబెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేయగా.. వీటి కోసం జనం భారీగా వచ్చారు.

–టెక్కలి

శివపూజకు వేళాయె..

స్వయంభూ లింగేశ్వరుని దర్శనానికి ముమ్మర ఏర్పాట్లు




కాశీబుగ్గ: స్వయంభూ లింగం వద్ద ఏర్పాట్లలో కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దభద్ర పంచాయతీ మహాదేవపురం కొండకోనల్లో వెలసియున్న స్వయంభూ లింగేశ్వరుని ఆలయం వద్ద పక్కా ఏర్పాట్లు చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి కొత్తపల్లి చిన్నాచారి తెలిపారు. పలాస నుంచి లొద్దబద్ర గ్రామం వద్దకు చేరుకుని అక్కడ నుంచి మహాదేవపురం గ్రామానికి చేరుకోవచ్చునని సూచించారు.

మహా శివరాత్రి పర్వదినం కోసం శైవక్షేత్రాలు సుందరంగా ముస్తాబయ్యాయి. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు శివాలయాల వద్ద బుధవారం జరగనున్న ఉత్సవాల కోసం ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. అన్నదానం, ప్రసాదాల వితరణకు కావాల్సిన పనులు పూర్తయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

చారిత్రాత్మకం..నందికేశ్వర ఆలయం



వజ్రపుకొత్తూరు: బెండిలోని నందికేశ్వర స్వామి ఆలయం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలంలో చారిత్రాత్మక దేవాలయమైన నందికేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. విద్యుత్ కాంతులతో శోభిల్లుతోంది. భక్తుల కోసం క్యూలైన్‌లు, తాగునీరు, ప్రసాదం ఏర్పాటు చేశారు. బెండి గ్రామంలో కొలువైన నందికేశ్వరుడుని మహా శివరాత్రి రోజున దర్శించుకోవడానికి జిల్లా వాసులతోపాటు ఒడిశాలోని సుర్ల, సురంగి ప్రాంతాల్లోకి కేవిటీ సామాజికవర్గానికి చెందిన భక్తులు అధికసంఖ్యలో వస్తారు. ఇక్కడ రుద్రాభిషేకాలు ఎక్కువగా నిర్వహిస్తారు. తిరువీధి ఉత్సవం, కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. పలాస రైల్వే స్టేషన్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ ఆలయానికి చేరుకోవాలంటే బెండిగేటు మీదుగా, చిన్నబడం వయా నగరంపల్లి మీదుగా, వజ్రపుకొత్తూరు మీదుగా ఈ ఆలయాలనికి చేరుకోవచ్చు.



రావివలస ఎండలమల్లన్న ఆలయం వద్ద ఏర్పాట్లు



కంచిలి: పుడాబద్ర గ్రామంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శివాలయం

ఇచ్ఛాపురం పట్టణంలో..



ఇచ్ఛాపురం: చిదంబరేశ్వరాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో ఉన్న 13 శివాలయాలు శివరాత్రి ఉత్సవాల కోసం ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఆలయకమిటీ సభ్యులు చలువపందిరిల్లు ఏర్పాటు చేశారు. అత్యంత జనాదరణ కలిగిన శివాలయాలలో ఒకటైన చిదంబరేశ్వరాలయం,రామలింగేశ్వరాలయం, పాతాళ సిద్ధేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, నర్మదేశ్వరాలయం ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. చిదంబరేశ్వరాలయం సమీప కోనేరులోని మహాశివుని విగ్రహం వద్ద సామూహిక కుంకుమ పూజలకు కావాల్సిన ఏర్పాట్లను కమిటీ సభ్యులు చేశారు.

ఆధ్యాత్మిక తీరం..



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలోని శివాలయం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని తీరప్రాంతంలో ఉన్న శివాలయాలు శివపూజలకు సిద్ధమయ్యాయి. అక్కుపల్లి శివసాగర్ తీరంలో 311 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన నీలకంఠేశ్వరాలయం, మోట్టూరు, కంబాలరాయుడుపేట తీరంలోని శివాలయాలు, వజ్రపుకొత్తూరు, పూడిలంక, గరుడబద్ర, గుళ్లలపాడులోని ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. అలయాల వద్ద తీర్థ ప్రసాదాలతో పాటు మంచినీటి సౌకర్యం, టెంట్లు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



కవిటి: కొండిపుట్టుగలో ఉత్సవాలకు ముస్తామైన శివాలయం



ఇచ్ఛాపురం రూరల్: శివరాత్రి ఉత్సవానికి ముస్తాబైన బిర్లంగిలోని పశ్చిమేశ్వర స్వామి ఆలయం